సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 6 । మే । 2023



వీడని వర్షం
జిల్లాలో అకాల వర్షంతో వరి రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఎడతెగని వానలతో పంట నేలవాలుతోంది.
8లో ▸



సేవా వలంటీర్
వలంటీర్లు సేవాభావం చాటుతున్నారు. దూరప్రాంతాల్లో ఉంటున్న లబ్ధిదారుల వద్దకు వెళ్లి పింఛన్ అందిస్తున్నారు.
8లో ▸

ఆలయ పన్నులపై అయోమయం
ధార్మిక సంస్థలు పన్నులు చెల్లించనవసరం లేదనే ఆదేశాలతో ద్వారకాతిరుమల గ్రామ పంచాయతీ అయోమయంలో పడింది.
8లో



వరి రైతుకు అభయం

సంక్షేమమే ప్రాధాన్యం

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా తడిసిన ధాన్యం కొనుగోళ్లు
- కల్లాల్లోనే అధికారులు
- 8.40 లక్షల టన్నుల దిగుబడి
- ఇప్పటికే 50 శాతం పూర్తయిన కొనుగోళ్లు
- ప్రతి గింజా కొంటామని మంత్రి కారుమూరి భరోసా



అత్తిలి ఏఎంసీలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, కమిషనర్ అరుణ్‌కుమార్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: రైతు సంక్షేమమే లక్ష్యంగా పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తోంది. దళారుల బెడద లేకుండా నేరుగా అన్నదాతల నుంచే ధాన్యాన్ని సేకరిస్తూ అండగా నిలుస్తోంది. కనీస మద్దతు ధర కల్పించడం ద్వారా ప్రతి గింజనూ పొలంలోనే కొనుగోలు చేస్తూ వ్యవసాయ, పౌరసరఫరాల శాఖల అధికారులు భరోసాగా ఉంటున్నారు. అలాగే రైతులకు సకాలంలో ధాన్యం సొమ్ములను వారి ఖాతాల్లో జమచేస్తున్నారు.

47 మండలాల్లో.. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 47 మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించిన అధికారులు గోనె సంచుల సరఫరా, హమాలీలు, రవాణా సౌకర్యాల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో 8.40 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా వేసి పటిష్ట కార్యాచరణతో కొనుగోలుకు చర్యలు తీసుకున్నారు. ముందుగానే గోనె సంచులను సిద్ధం చేసి కోతలు కోసిన కల్లాల్లో వద్దకు గోనె సంచులను పంపిస్తూ సైక్లింగ్ విధానంలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. కొనుగోళ్లు ప్రారంభమైనప్పటి నుంచి రోజూ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో జాయింట్ కలెక్టర్లు పర్యటిస్తూ సిబ్బందికి సూచనలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల కురిసిన వర్షాలకు సైతం పంటలు నష్టపోకుండా చర్యలు తీసుకున్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనేలా..
రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరు నాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ సీఎండీ వీరపాండ్యన్ పొలాలను, కల్లాలను పరిశీలిస్తూ తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని భరోసా కల్పిస్తున్నారు. వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా మేరకు ఏలూరు జిల్లాలో 11 వేల టన్నులు, పశ్చిమగోదావరి జిల్లాలో 11,500 టన్నుల ధాన్యం అకాల వర్షానికి తడిసిన నేపథ్యంలో ఆ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

చివరి గింజ వరకూ కొనుగోలు

రైతులకు సకాలంలో గోనె సంచులు, రవాణా సదుపాయాలు కల్పిస్తూ ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. నిరంతరం ధాన్యం కొనుగోలుపై సమీక్షిస్తూ క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ కల్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు ప్రారంభించాం. ఏ ఒక్క రైతు నష్టపోకుండా చూస్తాం.
– బి.లావణ్యవేణి, జేసీ, ఏలూరు జిల్లా

3.69 లక్షల టన్నుల కొనుగోలు
ఏలూరు జిల్లాలో 2,00,557 టన్నుల ధాన్యాన్ని 155 ఆర్‌బీకేలు, 87 ప్రాథమిక సొసైటీల ద్వారా కొనుగోలు చేసేందుకు నిర్ణయించారు. ఇప్పటివరకు 1,27,292 టన్నుల ధాన్యాన్ని 10,874 మంది రైతుల వద్ద నుంచి కొనుగోలు చేశారు. రూ.259 కోట్ల ధాన్యం కొనుగోలు చేసి, రైతులకు సొమ్ములు చెల్లించేందుకు చర్యలు తీసుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 364 ఆర్‌బీకేల ద్వారా 6.40 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించాలని నిర్ణయించారు. ఇప్పటివరకూ 266 ఆర్‌బీకేల ద్వారా 26,813 మంది రైతుల నుంచి 2.42 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. రూ.262 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసి సొమ్ములు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

అన్ని విధాలా ఆదుకుంటాం : మంత్రి కారుమూరి

అత్తిలి: రైతులను కష్టకాలంలో ఆదుకునేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం అత్తిలి మార్కెట్‌యార్డులో రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. వర్షాల వల్ల ధాన్యం బస్తాలన్నీ ఒకేచోట ఉండిపోవడంతో వాటిని తరలించేలా చర్యలు తీసుకున్నామన్నారు. తేమ 18, 19 శాతం ఉన్న ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తామన్నారు. నూక శాతం వల్ల కూడా ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. కృష్ణా జిల్లాలోని ఆరు, ఏలూరు జిల్లాలోని రెండు బాయిల్డ్ రైస్ మిల్లులకు కోసిన ధాన్యాన్ని నేరుగా తరలించేలా చర్యలు తీసుకున్నామన్నారు. మిల్లర్ల వద్దకు రైతులు వెళ్లాల్సిన పనిలేదన్నారు. అకాల వర్షంతో రైతుల వద్ద ఉన్న ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేస్తామని మంత్రి తెలిపారు. ఒక్కరోజే పశ్చిమగోదావరి జిల్లాలో 40 వేల టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు నిర్ణయించామన్నారు.

1967 టోల్‌ఫ్రీ : రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ మిల్లర్లు ఇచ్చిన బ్యాంకు గ్యారెంటీ ప్రకారం ధాన్యాన్ని పంపుతామన్నారు. ఎవరైనా మిల్లర్లు ఇబ్బంది పెడితే 1967 టోల్ ఫ్రీనంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని రైతులకు సూచించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి, భీమవరం ఆర్డీఓ దాసిరాజు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, పౌరసరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీప్రసాద్, వైఎస్సార్‌సీపీ అత్తిలి, తణుకు మండలాల అధ్యక్షులు పైబోయిన సత్యనారాయణ, బోడపాటి వీర్రాజు, ఉప సర్పంచ్ మద్దాల శ్రీనివాస్ ఉన్నారు.

నేరుగా ఫోన్ చేయండి
పెంటపాడు: ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు ఇబ్బంది పెడితే నేరుగా తనకు ఫోన్ చేయవచ్చని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు రైతులకు సూచించారు. ఆకుతీగపాడు గ్రామంలో ఆయన పర్యటించి వర్షం వల్ల ఇబ్బంది పడుతున్న రైతులను జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్‌తో కలిసి పరామర్శించారు. బరకాలు కప్పి ఉంచిన ధాన్యం రాశులను పరిశీలించారు. ధాన్యం దింపుకోక తేమ శాతం విషయంలో వివాదాలు ఏర్పడితే తక్షణం తనకు ఫోన్ చేయాలని సూచించారు. రైతుల విషయంలో చంద్రబాబు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. ధాన్యం కొనుగోలులో దళారుల ప్రమేయం లేకుండా సీఎం జగన్ ఆర్‌బీకేల ద్వారా కొనుగోలుకు చర్యలు తీసుకున్నారన్నారు. రైతులు అధైర్య పడవద్దని, అన్నివిధాలా ఆదుకుంటామని అభయమిచ్చారు. ముదునూరు సొసైటీ అధ్యక్షుడు బూరాడ శ్రీనివాస్, ముదునూరు, వ్యవసాయశాఖ ఏవో పార్థసారథి ఉన్నారు.

ప్రతి ధాన్యపు గింజనూ కొంటాం



మొగల్లులో రైతులతో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి కన్నబాబు

పాలకోడేరు: రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేసి ఆదుకుంటామని జిల్లా ప్రత్యేకాధికారి కె.కన్నబాబు భరోసా ఇచ్చారు. శుక్రవారం ఆయన పాలకోడేరు మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. మొగల్లులో పొలాల్లోని రైతులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నూక 30 శాతం వరకూ మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారని, దీనిని 40 శాతం వరకూ పెంచాలని రైతులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే తేమ 15 శాతం వరకూ మిల్లర్లు అనుమతిస్తున్నారని, దీనిని పెంచాలని కోరారు. రైతులు ఎలాంటి అధైర్యం పడవద్దని, ఈ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని ఆయన హామీ ఇచ్చారు. కలెక్టర్ ప్రశాంతి, జేసీ రామసుందర్‌రెడ్డి, ఆర్డీఓ దాసి రాజు, జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఏడీఏ వి.నారాయణరావు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం

వీరవాసరం: ప్రతికూల వాతావరణంలో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నందమూరుగరువు రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, బాలేపల్లి రోడ్డులో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని ఎవరూ ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూనికల యంత్రాలను 15 రోజులకు ఓసారి చెక్ చేయించుకోవాలని, గోనె సంచులు, వాహనాలను అందుబాటులో ఉంచామన్నారు. పూర్తిస్థాయిలో గోడౌన్లు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నామన్నారు. రైసు మిల్లుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. తహసీల్దార్ ఎం.సుందరరాజు, ఎంపీడీఓ ఎస్.ఉమామహేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఏఓ గీతాదేవి ఉన్నారు.

న్యూస్‌రీల్

హైకోర్టు జడ్జికి స్వాగతం



జడ్జి మల్లికార్జునరావును కలిసిన న్యాయవాదులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు విచ్చేసిన హైకోర్టు జడ్జి మల్లికార్జునరావుకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని పీపీలు, ఏపీపీలు, జీపీ సాదర స్వాగతం పలికారు. శుక్రవారం రాత్రి స్థానికంగా ప్రైవేట్ హోటల్‌లో బస చేసిన న్యాయమూర్తిని వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆచంట వెంకటేశ్వరరావు, డీపీ రామాంజనేయులు, కోనే సీతారాం, సీహెచ్ రాజేంద్రప్రసాద్, వి.లక్ష్మీకుమార్, కందుల శ్రీకృష్ణ దత్తు, జీపీ బీజే జగన్నాథరెడ్డి తదితరులు ఆయన్ను కలిసిన వారిలో ఉన్నారు.

సంక్షేమ క్యాలెండర్ విడుదల



సంక్షేమ క్యాలెండర్ విడుదల చేస్తున్న కలెక్టర్

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్ర ప్రభుత్వం 2023–24లో అమలు చేసే వివిధ సంక్షేమ పథకాల వివరాలతో రూపొందించిన సంక్షేమ క్యాలెండర్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక కలెక్టరేట్‌లో ఆమె మాట్లాడుతూ ఏ నెలలో ఏ పథకం ద్వారా లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతుందో తెలిపేలా క్యాలెండర్‌ను రూపొందించారని, వీటిని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు అందజేయాలని సూచించారు. ఏడాదిలో అమలుచేసే సంక్షేమ కార్యక్రమాలను సంక్షిప్తంగా వీటి ద్వారా తెలుసుకోవచ్చన్నారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి డి.నాగార్జున పాల్గొన్నారు.

ప్రజల చెంతకు న్యాయ సేవలు



సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): ప్రజల చెంతకు న్యాయ సేవలు తీసుకు రావాలనే ఉద్దేశంతో టెలీలా పోర్టల్‌ను ఏర్పాటుచేశామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి జి.రాజేశ్వరి తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో స్థానిక వెంకటాపురం సచివాలయం–5 వద్ద శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ టెలీలా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తమ ఫిర్యాదులను నేరుగా ఆయా న్యాయ సేవాధికార సంస్థలకు దాఖలు చేసుకోవచ్చన్నారు. శనివారం ఏలూరు కలెక్టరేట్‌లో బీమా కంపెనీల ప్రతినిధులతో కలెక్టర్, జిల్లా న్యాయాధికారులు సంయుక్తంగా వాహన ప్రమాద కేసుల సత్వర పరిష్కారం నిమిత్తం సమావేశం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని, ఉచిత న్యాయ సాయం అందిస్తామని తెలిపారు. ప్యానల్ లాయర్ జీవీ భాస్కర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ న్యాయవాదులకు శుభవార్త



లా అసిస్టెంట్ సెక్రటరీకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జిల్లా ప్రభుత్వ న్యాయవాది జగన్నాథరెడ్డి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో ప్రభుత్వం తరఫున వాదిస్తున్న జీపీ, పీపీ, ఏపీపీ, ఏజీపీ, ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్స్ తదితరులకు గౌరవ వేతనాల పెంపుదల విషయంలో ప్రభుత్వం త్వరలోనే శుభవార్త చెబుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లా అసిస్టెంట్ సెక్రటరీ వి.సునీత తెలిపారు. ఏలూరులో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి ఆమె శుక్రవారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రభుత్వ న్యాయవాది బి.జగన్నాథరెడ్డి ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జీపీ, ఏజీపీ, పీపీల గౌరవ వేతనం పెంచడానికి చర్యలు తీసుకోవాలంటూ వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన లా అసిస్టెంట్ సెక్రటరీ సునీత మాట్లాడుతూ ప్రభుత్వం త్వరలోనే శుభవార్త తెలుపనుందన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని కోర్టు కేసుల గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. జిల్లా జీపీ బీజే రెడ్డి ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

670 మందికి కళ్యాణమస్తు

భీమవరం (ప్రకాశంచౌక్): వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా కింద జనవరి నుంచి మార్చి–2023 త్రైమాసంలో వివాహాలు చేసుకున్న జిల్లాలో 670 మంది మహిళలకు రూ.4,47,70,000 వారి ఖాతాల్లో జమ చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. అమరావతి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కళ్యాణమస్తు పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమవరం కలెక్టరేట్‌లో కలెక్టర్ మాట్లాడుతూ షెడ్యూల్ కులాలకు చెందిన ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున 146 మందికి రూ.1.46 కోట్లు, షెడ్యూల్ కులాలు వారు కులాంతర వివాహం చేసుకున్న వారికి 23 మందికి రూ.1.20 లక్షల చొప్పున రూ.27.60 లక్షలు, షెడ్యూల్ ట్రైబల్ వారికి రూ.లక్ష చొప్పున ముగ్గురికి రూ.3 లక్షలు, షెడ్యూల్ ట్రైబల్ వారు కులాంతర వివాహం చేసుకున్న వారికి రూ.1.20 లక్షల చొప్పున ఒకరికి, బీసీలు రూ.50 వేల చొప్పున 428 మందికి రూ.2.14 కోట్లు, బీసీ మహిళలు కులాంతర వివాహం చేసుకున్న వారికి రూ.75 వేల చొప్పున 36 మందికి రూ.27 లక్షలు, మైనార్టీలు రూ.లక్ష చొప్పున ఆరుగురికి రూ.6 లక్షలు, దివ్యాంగులు రూ.1.50 లక్షల చొప్పున 11 మందికి రూ.16.50 లక్షలు, ఓసీల్లో భవన నిర్మాణ కార్మికుల కార్డు కలిగిన వారికి ఒక్కొక్కరికి రూ.40 వేల చొప్పున 16 మందికి రూ.6.40 లక్షలు మొత్తం 670 మందికి రూ.4,47,70,000 జమచేశామన్నారు. ఈ కార్యక్రమం కింద రెండో విడతగా ఈ మొత్తాన్ని జమచేశామని చెప్పారు. లబ్ధిదారులు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకొని పథకం లబ్ధి పొందాలని సూచించారు. అనంతరం నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. డీఆర్వో కె.కృష్ణవేణి, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి బి.శోభారాణి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి డి.పుష్పరాణి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.



భీమవరం కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రద్దయిన రథయాత్ర

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమ వేంకటేశ్వరస్వామి వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి నిర్వహించాల్సిన రథోత్సవం ప్రతికూల వాతావరణం కారణంగా రద్దయ్యింది. వేడుకను వైభవంగా నిర్వహించేలా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. స్థానిక గుడిసెంటర్‌లో రథాన్ని శోభాయమానంగా అలంకరించారు. అయితే సాయంత్రం నుంచి చిరుజల్లులు పడటంతో పాటు ఆకాశం మేఘావృతం కావడంతో ఆలయ అధికారులు రథోత్సవాన్ని రద్దు చేశారు. ఇదిలా ఉంటే ఆలయ ముఖ మండపంలో స్వామివారు గురువాయుర్ కృష్ణ అలంకారంలో దర్శనమిచ్చారు. శ్రీహరి కళాతోరణ వేదికపై భరతనాట్య ప్రదర్శనలు అలరించాయి.

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 8 గంటల నుంచి భజన కార్యక్రమాలు
- ఉదయం 10 గంటల నుంచి బుర్రకథ
- ఉదయం 10.30 గంటల నుంచి చక్రవారి అవభృథోత్సవం
- మధ్యాహ్నం 3 గంటల నుంచి వేద సభ
- సాయంత్రం 4 గంటల నుంచి నాదస్వరకచేరి
- సాయంత్రం 6 గంటల నుంచి కూచిపూడి, భరత నాట్య ప్రదర్శనలు
- రాత్రి 7 గంటల నుంచి పౌరాణిక నాటకం
- రాత్రి 7 గంటల నుంచి పూర్ణాహుతి, మౌనబలి, ధ్వజావరోహణ
- రాత్రి 8 గంటల నుంచి అశ్వవాహనంపై గ్రామోత్సవం
- ప్రత్యేక అలంకారం: నవనీత కృష్ణ



గుడిసెంటర్‌లో నిలిచిన శ్రీవారి రథం

రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు పర్యటన

- టీడీపీని బతికించుకునేందుకే డ్రామాలు
- రైతులకు అన్నివిధాలా అండగా ఉంటాం
- ఎమ్మెల్యేలు కొఠారు, వాసుబాబు



ఏలూరులో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు కొఠారు అబ్బయ్యచౌదరి, పుప్పాల వాసుబాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు రాజకీయ లబ్ధి కోసమే ఉంగుటూరు పర్యటన చేశారని దెందులూరు, ఉంగుటూరు ఎమ్మెల్యేలు కొఠారు అబ్బయ్యచౌదరి, పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో అబ్బయ్యచౌదరి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విపత్తులను కూడా రాజకీయం చేసే ప్రతిపక్ష నాయకుడు ఉండటం దురదృష్టకరమన్నారు. పథకం ప్రకారం గన్నవరం నుంచి నేరుగా ఉంగుటూరు చేరుకుని కథ, స్క్రీన్‌ప్లే, డ్రామా నాటకానికి తెరతీశారని మండిపడ్డారు. చంద్రబాబు గత ఐదేళ్ల పాలనలో 14.58 లక్షల మంది రైతుల నుంచి 265.09 లక్షల టన్నుల ధాన్యం సేకరించి రూ.43,134 కోట్లు అందజేస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడున్నరేళ్ల పాలనలో 24.25 లక్షల మంది రైతుల నుంచి 261.86 లక్షల టన్నుల ధాన్యం సేకరించి రూ.48,793.87 కోట్లు చెల్లించామన్నారు. ఈ లెక్కలపై ఎవరికైనా అనుమానాలుంటే ఎవరు వచ్చినా రుజువు చేస్తామని చాలెంజ్ విసిరారు. ప్రతి రైతుకూ జవాబుదారీగా, రైతును రాజుగా చూడాలనే సంకల్పంతో సీఎం జగన్ అన్నింటా అండగా ఉంటున్నారన్నారు. రైతులకు ఏ చిన్న కష్టం వచ్చినా వెంటనే స్పందించేలా అధికార యంత్రాగాన్ని, ప్రజా ప్రతినిధులను అప్రమత్తం చేస్తున్నారన్నారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి కేవలం 21 రోజుల్లో చెల్లింపులు చేశారని, చంద్రబాబు ఎప్పుడైనా ఇలా చెల్లింపులు చేశారా అని ప్రశ్నించారు. ఉంగుటూరులో చంద్రబాబు చెప్పింది తప్పు అని చెప్పడానికి పలువురు రైతులు ఇక్కడికి వచ్చారన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో నష్టపోయిన రైతులను ఆదుకోవడం కోసం సీఎం జగన్ రూ.3 వేల కోట్లు కేటాయించారని స్పష్టం చేశారు. వ్యవసాయం దండగ అనడం, వ్యవసాయ విద్యుత్ చార్జీలు తగ్గించమ ని రోడ్డెక్కిన రైతులను కాల్చి చంపడం, కరెంటు తీగలపై బట్టలు ఆరేసుకోవాలని చెప్పడం చంద్రబాబుకు వ్యవసాయంపై, రైతులపై ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. ప్రకృతి విపత్తు సమయంలో ఎక్కడో ఒక చోట పంట దెబ్బతింటే ఎమ్మెల్యేలను రాజీనామా చేయాలని అడుగుతున్న చంద్రబాబు తన పాలనలో దెందులూరు నియోజకవర్గంలో ఒక మహిళా ఎమ్మార్వోపై దాడి చేసిన తన ఎమ్మెల్యేతో ఎందుకు రాజీనామా చేయించలేదని ప్రశ్నించారు. ధాన్యం తడిసినా, మొలకెత్తినా ప్రతి గింజా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని అన్నారు. తన నియోజకవర్గంలో సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న దుష్ప్రచారాలపై చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో భూస్థాపితమైన టీడీపీని బతికించుకోవడానికే చంద్రబాబు డ్రామా పర్యటన చేశారని ఎద్దేవా చేశారు. జగనన్న ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని విత్తు నుంచి విక్రయాల వరకూ అన్నింటా అండగా నిలిచేలా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేశారన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో ఈ రబీ సీజన్‌లో 12,984 మంది రైతుల నుంచి 95,162 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.189.1 కోట్లకు రూ.123.64 కోట్లు చెల్లింపులు పూర్తి చేశామన్నారు. నియోజకవర్గానికి 35,64,150 సంచులు అవసరం కాగా ఇప్పటివరకూ 33,56,750 సంచులను రైతులకు సరఫరా చేశామని వివరించారు. తమ నియోజకవర్గంలో రైసు మిల్లులు ఎక్కువగా లేనందున ఏలూరు, దెందులూరు, ముదినేపల్లి తదితర ప్రాంతాల మిల్లులకు తరలిస్తున్నామని, దీనివల్ల ధాన్యం తోలకంలో కొంత ఆలస్యమవుతుందే తప్ప ఎక్కడా నిర్లక్ష్యంగా వ్యవహరించడం లేదన్నారు. ఉంగుటూరులో కొంతమంది ఆర్టిస్టులను ఏర్పాటు చేసి టీడీపీకి కావాల్సినట్టు చెప్పించుకున్నారని, ఆ ప్రాంతంలో ఒక మహిళకు రూ.2.70 లక్షలు ఇవ్వడం చూసిన ఎవరికైనా అప్పటికప్పుడు అంత డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది అనే ఆలోచన తప్పక వస్తుందని, ఇది ముందుగానే ఏర్పాటుచేసిన కార్యక్రమం కాబట్టే ఆ మొత్తాన్ని వాళ్లు వెంట తెచ్చుకుని డ్రామాను రక్తి కట్టించడానికి ప్రయత్నించారన్నారు. దేశంలో ఎక్కడా లేని పంట మద్దతు ధర ఆంధ్రప్రదేశ్‌లో ఉందని, రైతుల పక్షపాతిగా సీఎం జగన్ ప్రతి రైతుకూ న్యాయం చేస్తున్నారని స్పష్టం చేశారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు ఘంటా ప్రసాదరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

బ్లాక్‌లిస్టులో ఆరు రైసు మిల్లులు

కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: దాళ్వా ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని, మిల్లర్లు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి ఆరు రైసు మిల్లులను బ్లాక్‌లిస్టులో పెట్టామని చెప్పారు. ఇప్పటివరకూ 266 ఆర్‌బీకేల ద్వారా 27,225 మంది రైతుల నుంచి 2,46,118 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రూ.502 కోట్లకు రూ.340.52 కోట్లను రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. రైతులకు అవసరమైన గోనె సంచులు, హమాలీలు, వాహనాలను ఆర్‌బీకేల వద్ద ఏర్పాటుచేశామన్నారు. రైతులు స్వయంగా వీటిని సమకూర్చుకుంటే ధాన్యం నగదుతో పాటు చార్జీలను జమచేస్తామన్నారు. ట్రక్ షీట్ జనరేట్ అయిన తర్వాత రైతులెవ్వరూ మిల్లులకు వెళ్లాల్సిన అవసరం లేదని, ఈ మేరకు అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ఆఫ్‌లైన్ విధానం ద్వారా ధాన్యం సేకరిస్తామన్నారు. రైసు మిల్లులపై రైతుల నుంచి వచ్చిన ఆరోపణలను ఎప్పటికప్పుడు పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు సమస్యలుంటే రైతు భరోసా కేంద్రం, మండల అధికారులను సంప్రదించాలని, జిల్లా కంట్రోల్ రూమ్ 8121676653కి ఫోన్ చేసి తెలియజేయవచ్చని తెలిపారు.

క్లుప్తంగా

బాస్కెట్‌బాల్ పోటీల్లో బాలికల సత్తా



ఏపీ సీఎం కప్ పోటీల్లో రెండో స్థానంలో నిలిచిన బాస్కెట్‌బాల్ జట్టు

ఏలూరు రూరల్: ఏపీ సీఎం కప్ బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాలికల జట్టు రెండోస్థానం సాధించింది. ఈ నెల 1 నుంచి 5 వరకూ తిరుపతిలో ఏపీ సీఎం కప్ ఆటల పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న మహిళల జట్టు ఫైనల్‌లో అనంతపురం జట్టుతో హోరాహోరీ తలపడింది. 28–43 స్కోర్ తేడాతో ఓటమి పాలయ్యారు.

సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ అదృశ్యంపై కేసు నమోదు

ఆగిరిపల్లి: సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎన్.చంటిబాబు శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 39వ సీఆర్పీఎఫ్ గన్నవరం హెడ్ క్వార్టర్స్‌కు చెందిన సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ బి.శ్రీనివాస్ నూగొండపల్లిలోని సీఆర్పీఎఫ్ అవుట్ పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. గత ఏడాది డిసెంబర్ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా వెళ్లిపోయాడు. గత నెల 30న సీఆర్పీఎఫ్ అవుట్‌పోస్టుకు వచ్చి శ్రీనివాస్ ఒక రోజు విధుల్లో చేరి మళ్లీ కనిపించకుండా వెళ్లిపోయాడు. సీఆర్పీఎఫ్ ఎస్‌ఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వీడని వర్షం.. తప్పని అవస్థలు

సాక్షి, భీమవరం: వీడని అకాల వర్షంతో జిల్లాలోని వరిరైతులు ఇబ్బందులు పడుతున్నారు. మాసూళ్లు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వం ఎప్పటికప్పుడు కొనుగోలు చేస్తున్నా కోతలు పూర్తికాని వరి చేలు ఈదురు గాలులు, భారీ వర్షానికి నేలవాలుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత దాళ్వా సీజన్‌లో జిల్లాలోని 20 మండలాల పరిధిలో సుమారు 2.19 లక్షల ఎకరాల్లో వరినాట్లు వేశారు. దాదాపు 50 శాతం వరకు మాసూళ్లు పూర్తికాగా భీమవరం, పాలకొల్లు, ఉండి, ఆచంట నియోజకవర్గాల పరిధిలో ముమ్మరంగా మాసూళ్లు చేస్తుండగా అకాల వర్షంతో కళ్లాల్లోని ధాన్యం తడిచిపోవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.

ఎండ.. వాన దోబూచులాట

వాతావరణంలో మార్పులు కారణంగా కొద్దిసేపు ఎండరావడంతో రైతులు గట్టుకు చేర్చిన ధాన్యాన్ని ఎండబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కొద్దిసేపటికే ఒక్కసారిగా భారీ వర్షం పడడంతో ఎండబెట్టిన ధాన్యాన్ని తడవకుండా జాగ్రత్తలు తీసుకోడానికి రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఒకచోట వర్షం కురుస్తుంటే మరొకచోట భారీ వర్షం కురుస్తోంది. శుక్రవారం జిల్లాలోని అత్తిలిలో అత్యధికంగా 51 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా తణుకులో 36.4, పెంటపాడులో 30.2, పాలకోడేరులో 21.8, ఆచంటలో 18, గణపవరంలో 19.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా భీమవరం, కాళ్ల, మొగల్తూరు, నరసాపురం, పాలకొల్లు తదితర ప్రాంతాల్లో వర్షపాతం నమోదు కాకపోవడం విశేషం.



వీరవాసరం మండలంలో వర్షాలకు నేలవాలిన దాళ్వా పంట

నిలిచిపోయిన మాసూళ్లు

బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించడంతో రైతులు ధాన్యం మాసూళ్ల పనులు నిలిచిపివేశారు. రైతులు ఎక్కువగా వరికోత యంత్రాలను ఉపయోగించడంతో గట్టుకు చేరిన ధాన్యం కనీసం రెండు, మూడు రోజులు ఎండబెట్టాల్సివుంటుంది. మాసూళ్లు చేసిన వెంటనే రాశులు చేస్తే ధాన్యం రంగుమారే ప్రమాదముంది. గట్టుకు చేరిన ధాన్యాన్ని వర్షాల కారణంగా ఎండబెట్టే అవకాశం లేకపోవడంతో మాసూళ్ల పనులు నిలిచిపోయాయి.

నేలవాలుతున్న వరి పంట

బంగారు వర్ణంలో కళకళలాడుతున్న దాళ్వా వరిపంట గత 5 రోజులుగా ఈదురుగాలులు, వర్షాలకు నేలవాలిపోతుంది. దీంతో నేలనంటిన ధాన్యం రంగుమారిపోతుందని, అలాగే యంత్రాలతో మాసూళ్లు చేయడానికి ఎక్కువ సమయం పట్టడం వల్ల ఖర్చు పెరిగిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దేవాలయాల పన్నులపై అయోమయం

ద్వారకాతిరుమల: దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని ధార్మిక, మతపరమైన సంస్థలన్ని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లు, పంచాయితీలకు ఎలాంటి పన్నులు చెల్లించనక్కర్లేదని ఈ ఏడాది మార్చి 29న అప్పటి రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎం.హరి జవహర్‌లాల్ సర్క్యులర్ జారీ చేశారు. ఈ సర్క్యులర్ జారీతో ద్వారకా తిరుమల గ్రామ పంచాయతీ అయోమయంలో పడింది. శ్రీవారి దేవస్థానం 2016లో స్థానిక పంచాయతీ అధిక పన్నులను విధించిందంటూ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించింది. ఇదిలా ఉంటే గ్రామ పంచాయతీతో పాటు క్షేత్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని గత కొద్దిరోజులుగా గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, చినవెంకన్న దేవస్థానం ఛైర్మన్ ఎస్వీ సుధాకరరావులు ఏలూరు జిల్లా కలెక్టర్ వి.ప్రసన్న వెంకటేష్ సూచన మేరకు పన్నుల చెల్లింపు, తదితర అంశాలపై చర్చలు జరుపుతున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల



శ్రీవారి దేవస్థానం సత్రాలు, గదులు, కల్యాణ మండపాలకు పంచాయతీ అధికారులు కొత్త పన్నులను నిర్ణయించారు. అంతా ఒక కొలిక్కి వస్తుందనుకున్న సమయంలో దేవాలయాలు పన్నులు చెల్లించనవసరం లేదని సర్క్యులర్ జారీ అయ్యింది. ఇప్పుడు అధికారులు ఏం నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేత

చింతలపూడి: చింతలపూడి మండలం పోతునూరు సచివాలయం వలంటీర్ కె.శ్రావణి హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి పింఛన్ అందచేసింది. గ్రామానికి చెందిన కంభంపాటి నాగమ్మ గత రెండు నెలలుగా తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చితకిత్స పొందుతుంది. నడవలేని స్థితిలో ఉన్న నాగమ్మ పరిస్థితిని గుర్తించి గురువారం రాత్రి బయలుదేరి వెళ్ళిన వలంటీర్ శ్రావణి శుక్రవారం ఆసుపత్రికి వెళ్ళి పింఛన్ అందచేశారు. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ మొలుగుమాటి నీరజా సుధాకర్, సర్పంచ్ కందుల లక్ష్మీ ప్రసన్న కుమారి, ,గ్రామస్తులు పింఛన్ అంద చేసిన వలంటీర్‌ను అభినందించారు.



హైదరాబాద్‌లో వృద్ధురాలికి పింఛన్ అందచేస్తున్న వలంటీర్ శ్రావణి

ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో పింఛన్ అందజేత

కామవరపుకోట: ఇటీవల కాలికి ఆపరేషన్ చేయించుకుని ఏలూరు ఆశ్రం హాస్పిటల్లో చికిత్స పొందుతున్న స్థానిక కొత్తూరు గ్రామానికి చెందిన కోలా ఏసుకుమార్‌బాబుకు కామవరపుకోట సచివాలయం–2 వలంటీరు సిరిగినేటి వెంకట నాంచారయ్య ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేశారు. దీంతో లబ్ధిదారుడు ఏసుబాబు, కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటామని హర్షం వ్యక్తం చేశారు.



కోలా ఏసుకుమార్ బాబాకు పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ నాంచారయ్య

కాకినాడ వెళ్లి..

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం మండపాకకు చెందిన వలంటీర్ గొల్లపల్లి లిల్లీ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గ్రామానికి చెందిన పింఛన్‌దారుడు పమ్మి వెంకట్రావుకు పింఛన్ అందజేశారు. మండపాక గ్రామానికి చెందిన వెంకట్రావు గత నెల నుంచి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం తణుకు నుంచి సొంత ఖర్చులతో తణుకు నుంచి కాకినాడ వెళ్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకట్రావుకు పింఛన్ సొమ్మును వలంటీర్ అందజేశారు. వలంటీర్ లిల్లీని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ ఉండవల్లి జానకి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పెండ్యాల మణికంఠ తదితరులు అభినందించారు.



కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ గొల్లపల్లి లిల్లీ

గంజాయి విక్రేతలపై పీడీ యాక్ట్

సాక్షి, భీమవరం: జిల్లాలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు నేరస్తులను పీడీ యాక్ట్‌తో జైలుకు పంపినట్లు ఎస్పీ యు.రవిప్రకాష్ శుక్రవారం విలేకర్లకు చెప్పారు. నాటు సారా తయారీ, విక్రయం , గంజాయి, ఇతర రాష్ట్రాల మద్యం, మత్తుపదార్థాలను సరఫరా చేసే వారిపై కేసులు నమోదు చేసి ఉక్కు పాదం మోపుతున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగానే మూడు కేసులు కంటే ఎక్కువ ఉన్న నేరస్తులపై పీడీ యాక్ట్ పెట్టి వారిని ఏడాది పాటు సత్ప్రవర్తన కలిగి ఉండేలా జైలుకు పంపుతున్నామన్నారు. మూడు కంటే ఎక్కువ కేసులు కలిగి గంజాయి రవాణా చేసి యువతకు విక్రయిస్తున్న భీమవరం పట్టణానికి చెందిన అడపా శ్రీరాములు(ఉల్లిపాయ) కాటూరి వెంకటేశ్వరరావు(బాబి), పోలిశెట్టి రాములను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు పంపించినట్లు ఎస్పీ రవిప్రకాష్ చెప్పారు.



ఎస్పీ యు.రవిప్రకాష్

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు ఎన్ఆర్‌పేట కొత్తబస్టాండ్ వెనుక రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు రూరల్ టెలికం నగర్, 1వ రోడ్డు సౌభాగ్యలక్ష్మి గుడి ప్రాంతానికి చెందిన దాసరి నీలకంఠ శివికుమార్ గురువారం రాత్రి సుమారు 11గంటల సమయంలో కొత్తబస్టాండ్ వెనుక రైలు పట్టాలు దాటుతున్నాడు. ఇదే సమయంలో ఫలక్‌నుమా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు బండి రావటాన్ని శివికుమార్ గుర్తించకపోవటంతో రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను మృతిచెందాడు. ఏలూరు రైల్వే హెడ్ కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శవ పంచనామా పూర్తిచేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.



మృతుడు దాసరి నీలకంఠ

స్కూల్ పాయింట్‌గా విద్యాకానుక కిట్ల సరఫరా

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు ఇచ్చే జగనన్న విద్యాకానుక కిట్లను స్కూల్ పాయింట్‌గా సరఫరా చేయడానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అంగీకరించారని వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు గెడ్డం సుధీర్ తెలిపారు. శుక్రవారం విజయవాడలోని సమగ్రశిక్ష భవనంలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై వివిధ ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఇందుకు సంబంధించి ఉపాధ్యాయ సంఘాలకు తెలిపారని వివరించారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం పూర్తిగా తగ్గించామని మంత్రి తెలిపారన్నారు. భవిష్యత్‌లో జరిగే బదిలీల్లో అవసరమైతే కోడ్ తీసుకువస్తామని మంత్రి స్పష్టం చేశారన్నారు. రాష్ట్రంలో ఎంఈఓల పదోన్నతులు, స్కూల్ అసిస్టెంట్‌ల బదిలీలు నిర్వహించాలని మంత్రి బొత్సకు వైఎస్ఆర్ టీఎఫ్ తరఫున ప్రాతినిధ్యం చేశామన్నారు. బదిలీలకు సంబంధించి కనిష్టంగా రెండు సంవత్సరాలు, గరిష్టంగా 8 సంవత్సరాలు ప్రాతిపదికగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరామని, అలాగే జీఓ 117 ప్రకారం ఎఫెక్ట్ అయ్యే ఉపాధ్యాయులందరికీ స్టేషన్ పాయింట్లు ఇవ్వాలని కోరామన్నారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.



మంత్రి బొత్సకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్ఆర్‌టీఎఫ్ నాయకులు

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

పోలవరం రూరల్ : పోలవరం గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హెచ్‌సీ శ్రీనివాసరావు తెలిపారు. బాలిక గురువారం ఉదయం బయటకు వెళ్లిందని, అప్పటి నుంచి కనబడటం లేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

యాసిడ్ దాడి నిందితుడిపై కేసు నమోదు

ఏలూరు టౌన్: ఏలూరు తంగెళ్ళమూడి ఎంఆర్‌సీ కాలనీలో ఉంటున్న మహిళపై ఆమె భర్త యాసిడ్ పోయడంతో ఆమె కుడికాలు, నడుముపై తీవ్ర గాయాలయ్యాయి. ఆమె ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. టూటౌన్ సీఐ పి.చంద్రశేఖర్ కేసు నమోదు చేశారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ధరణికి నాగేంద్ర వరప్రసాద్‌తో మూడేళ్ళ క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. నాగేంద్ర వరప్రసాద్ ఏలూరులో ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. వీరిద్దరూ తంగెళ్ళమూడి ఎంఆర్‌సీ కాలనీలో ఉంటుండగా ధరణి ప్రస్తుతం 3 నెలల గర్భిణి. రెండు రోజుల క్రితం ఇద్దరి మధ్య వివాదం ఏర్పడింది. శుక్రవారం రాత్రి గొడవ జరగటంతో తీవ్ర ఆగ్రహానికి గురైన భర్త వరప్రసాద్ తన భార్యను కొట్టటంతోపాటు బాత్‌రూమ్ కడిగే యాసిడ్ పోయటంతో ఆమెకు గాయాలయ్యాయి.

రూ.1,400 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు

విజ్జేశ్వరం వద్ద ప్రారంభం

కొవ్వూరు: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకి గోదావరి జలాలను తరలించి డెల్టా ప్రాంతంలో తాగునీటి సమస్య తీర్చేందుకు చేపట్టిన మంచినీటి సరఫరా పథకాన్ని రూ.రూ.1,400 కోట్లతో చేపడుతున్నామని గ్రామీణ నీటి సరఫరా విభాగం చీఫ్ ఇంజనీర్ టి.గాయత్రీ వెల్లడించారు. జల జీవన్ మిషన్ నిధులతో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ, అగ్రిమెంట్లు పూర్తయినట్లు ఆమె వెల్లడించారు. ప్రస్తుతం సర్వే పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయనున్నట్లు తెలిపారు. కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లాకి చెందిన ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో వివిధ పథకాల పురోగతిపై ఆమె సమీక్షించారు. ప్రధానంగా జల జీవన్ మిషన్ పనులు, జగనన్న కాలనీలకు కుళాయిల ఏర్పాటు, తాగునీటి పథకాల నిర్మాణంపై సమీక్షించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జల జీవన్ పథకంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 1,178 ఆవాసాలకు, పది నియోజకవర్గాలకు చెందిన 17.85 లక్షల మందికి తాగునీటి సరఫరా చేయాలన్న ఉద్దేశ్యంతో ఈ పథకం ఉపకరిస్తుందన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా 63,212 పనులు మంజూరయ్యాయన్నారు. వీటిలో 31,372 పనులు వివిధ దశల్లో ఉన్నాయని, 14,699 పనులు ఇప్పటికే పూర్తి చేసినట్లు ఆమె ప్రకటించారు. వేసవి నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని తాగునీటి చెరువులను పూర్తిగా నింపామన్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ఎన్వీవీ సత్యనారాయణ, భీమవరం ఈఈ ఏఎస్‌పీ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో క్రికెట్ బెట్టింగ్ ముఠాలపై నిఘా మరింత పెంచామని, బెట్టింగులు నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు వన్‌టౌన్ సీఐ బోణం ఆదిప్రసాద్ తెలిపారు. ఏలూరు రూరల్ స్టేషన్ పరిధిలో తంగెళ్ళమూడి శివారులోని అపార్ట్‌మెంట్లలో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తోన్న ముఠాను అరెస్టు చేశారు. ఈ మేరకు ఏలూరు రూరల్ స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు వివరాలు తెలిపారు. ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తంగెళ్ళమూడి శివారులోని భూపతి రాజు హైట్స్ అపార్ట్‌మెంట్స్‌లో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారనే సమాచారంతో వన్‌టౌన్ సీఐ ఆదిప్రసాద్ ఆధ్వర్యంలో రూరల్ ఎస్ఐ ఎన్.లక్ష్మణబాబు తన సిబ్బందితో దాడులు చేసి క్రికెట్ బెట్టింగ్ ముఠాను అరెస్టు చేశారు. సన్ రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతుండగా బెట్టింగ్‌లు నిర్వహిస్తూ ఉండగా అరెస్టు చేశారు. ఘంటా సింహాచలం, నున్నా రమేష్, కొడమంచి నాగ, బల్లిపాడు భానుకిరణ్‌ను అరెస్టు చేశారు. క్రికెట్ బెట్టింగ్ ముఠా ప్రధాన సూత్రధారులైన హైదరాబాద్‌కు చెందిన మరో ముగ్గురు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి ల్యాప్‌టాప్స్–2, ట్యాబ్‌లు–2, స్మార్ట్‌ఫోన్‌లు–10, కీప్యాడ్ ఫోన్లు –3, రూ.13వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు ఇన్‌ఛార్జ్ డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు పర్యవేక్షణలో ఏలూరు నగరంలో క్రికెట్ బెట్టింగ్ ముఠాలపై ప్రత్యేకమైన నిఘా ఉంచామని తెలిపారు.



వివరాలు వెల్లడిస్తోన్న ఏలూరు వన్‌టౌన్ సీఐ ఆదిప్రసాద్

ప్రజలకు చేరువగా రిజిస్ట్రేషన్ సేవలు

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఏలూరు రేంజ్ డీఐజీ కె.అబ్రహం

జంగారెడ్డిగూడెం: రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన అన్ని సర్వీసులు ప్రజలకు చేరువ చేసే ఉద్దేశ్యంతో గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఏలూరు రేంజ్ డీఐజీ కె.అబ్రహం తెలిపారు. జంగారెడ్డిగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డులు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ తదితర విషయాలు పరిశీలించారు. ఈ సందర్భంగా అబ్రహం మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ సర్వీసులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు, గ్రామ, వార్డు సచివాలయాల్లో కూడా అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. డాక్యుమెంటేషన్ విషయంలో కూడా ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్‌లో టెంప్లేట్‌లు అందుబాటులో ఉంచామన్నారు. వాటిని ఉపయోగించుకుంటూ ప్రజలే డాక్యుమెంట్స్ తయారు చేసుకోవచ్చన్నారు. డాక్యుమెంట్‌లను సంబంధిత గ్రామ, వార్డు సచివాయాల అధికారులు పరిశీలించి, అనంతర సేవలు అందిస్తారన్నారు. ప్రజలకు స్టాంప్‌ల విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఈ–స్టాంపింగ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. జంగారెడ్డిగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోందన్నారు. దాతలు అందించిన భూమి ఉందని, స్థలం, నూతన భవన నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సబ్ రిజిస్ట్రార్ ఏవీవీ జగన్‌మోహన్‌రావు, డీఐజీ సీసీ ఎస్.సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.



బుద్ధ పార్కు పునఃప్రారంభం

ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో ప్రజలకు ఆహ్లాదాన్నిచ్చేలా బుద్ధపార్కును మరింత సుందరంగా తీర్చిదిద్దామని, ప్రజలకు ఉల్లాసాన్ని ఇచ్చేలా పార్కును అభివృద్ధి చేశామని మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. కరోనా విలయం సమయంలో అనివార్య కారణాలతో మూతపడిన బుద్ధపార్కును శుక్రవారం మేయర్ నూర్జహాన్ పునఃప్రారంభించారు. ఆసియా ఖండంలోనే ప్రముఖమైన బుద్ధ విగ్రహాల్లో ఏలూరు బుద్ధపార్కులోని 74 అడుగుల ఎత్తైన బుద్ధ విగ్రహం ఒకటని చెప్పారు. బోట్ షికార్, వాటల్ ఫౌంటేన్, క్యాంటీన్ ప్రారంభించామని తెలిపారు.

త్వరలోనే జెట్ ఫౌంటేన్‌ను సైతం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించటమే లక్ష్యంగా పార్కును అభివృద్ధి చేశామని తెలిపారు. నగరంలోని మిగిలిన పార్కులను కూడా సుందరీకరించి, అందుబాటులోకి తెస్తామని తెలిపారు. వేసవికాలంలో సాయంత్రం వేళల్లో మంచి వాతావరణాన్ని ఆస్వాదించేలా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఏలూరు వన్‌టౌన్ స్థానిక కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ బాపిరాజు, ఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి, కాంట్రాక్టర్ గోలి శరత్‌రెడ్డి, పాలడుగు మురళీశ్యామ్ తదితరులు ఉన్నారు.



బుద్ధ పార్కును ప్రారంభిస్తున్న మేయర్ నూర్జహాన్, చిత్రంలో కార్పొరేటర్ శ్రీదేవి, కమిషనర్ వెంకటకృష్ణ

శాస్త్రీయ కళలను కాపాడాలి



వయోలిన్ కచేరి నిర్వహిస్తున్న కళాకారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రపంచ సంగీత రంగానికి మన శాస్త్రీయ కళలు దిక్సూచి వంటివని వక్తలు పేర్కొన్నారు. స్థానిక ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక రామచంద్రరావుపేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో ప్రముఖ సంగీత కళాకారిని చల్లపల్లి సీతాదేవి జ్ఞాపకార్థం శుక్రవారం వయోలిన్ సోలో సంగీత కచేరి నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ కళలను కాపాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందన్నారు. కార్యక్రమంలో ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఉపాధ్యక్షుడు ఎల్ వెంకటేశ్వరరావు, కార్యదర్శి దువ్వి హేమ సుందర్, కోశాధికారి దేవరకొండ అచ్యుత్ కుమార్, కమిటీ సభ్యులు ఎన్వీ గంగా భవాని, పి.కనకదుర్గ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని చల్లపల్లి లక్ష్మీ నరసింహ కృష్ణన్, సువర్చల పర్యవేక్షించారు.

గంజాయి తరలిస్తూ వ్యక్తి అరెస్ట్

పెదవేగి: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు అరెస్ట్ చేశారు. టాక్స్‌ఫోర్స్ సీఐ జీఎస్ కృష్ణధనరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. బెజవాడ సుబ్బారావు అనే వ్యక్తి గంజాయి తరలిస్తున్నాడని, సమాచారం అందడంతో తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. సుబ్బారావు 650 గ్రాముల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడు. దీని విలువ సుమారు రూ.5 వేల విలువ ఉంటుందని అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

వాసవీమాతకు పంచామృతాలతో అభిషేకాలు


వాసవీమాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వాసవీ కన్యకపరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో వాసవి అమ్మవారికి పౌర్ణమి, శుక్రవారం సందర్భంగా పంచామృతాలతో అభిషేకాలు వైభవంగా జరిగాయి. తొలుత ఆలయ అర్చకులచే విఘ్నేశ్వర పూజ, సుగంధ ద్రవ్యాలతో, ఫలరసాలతో పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం కోశాధికారి నున్న బాలా త్రిపుర సుందరరావు, పూర్వ అధ్యక్షుడు పేరూరి కాశయ్య తదితరులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

బలుసులమ్మకు ప్రత్యేక పూజలు


బలుసులమ్మ అమ్మవారి దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం సందర్భంగా భారీ అన్నసమారాధన జరిగింది. తొలుత ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొట్టు అంజిబాబు, సభ్యులు వట్టిప్రోలు రాము, పెదప్రోలు భాస్కర్, వెలనాటి సత్తిబాబు తదితరులు పర్యవేక్షించారు.

ధ్యాన మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ


వేణుగోపాల స్వామి విగ్రహం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని రామచంద్రరావుపేటలోని కృష్ణయోగ ధ్యాన మందిరంలో శుక్రవారం సుమారు రెండున్నర లక్షలు విలువ చేసే నూతన వేణుగోపాల స్వామి పాలరాయి విగ్రహాన్ని ప్రతిష్ఠ చేశారు. దాతలు యలమర్తి వీర వెంకట జయ నాగేశ్వరరావు, సత్యభాస్కరి దంపతులచే ప్రత్యేక పూజలు జరిగాయి. ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు. భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్థిక సాయం అందజేత


కొమరవరంలో బీమరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు టౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తణుకు రూరల్ మండలం కొమరవరం గ్రామానికి చెందిన జిల్లేళ్ల బీమరాజు కుటుంబాన్ని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పరామర్శించారు. శుక్రవారం ఉదయం కొమరవరం గ్రామంలోని బీమరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబానికి రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, గ్రామ సర్పంచ్ కరిబండి రాజేష్, సొసైటీ అధ్యక్షుడు నిమ్మకాయల సురేష్ బాబు, నాయకులు ఆకాశం నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కారల్ మార్క్స్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

తణుకు: సమాజంలో దోపిడీ, ఆర్థిక అసమానతలు అంతానికి సోషలిస్టు సమాజ స్థాపనకు కారల్ మార్క్స్ చేసిన కృషి మరువలేనిదని సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు అన్నారు. శుక్రవారం తణుకు సీపీఐ కార్యాలయంలో పట్టణ సమితి ఆధ్వర్యంలో కమ్యూనిస్టు ఉద్యమ పితామహుడు కార్ల్ మార్క్స్ 205వ జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా కోశాధికారి గుబ్బల వెంకటేశ్వరరావు కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ కార్మికుల కోసం, వారి సమస్యల పరిష్కారానికి పోరాడిన కారల్ మార్క్స్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇరగవరం మండల కార్యదర్శి నామన వెంకటేశ్వరరావు, గార ప్రసాద్, నూనె రాధాకృష్ణ, ఎం.శ్రీనివాస్, నొడగల అప్పారావు, కె.ఎస్.రావు, కాపకాయల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా కారల్ మార్క్స్ జయంతి

ఇరగవరం: మండలంలోని తూర్పువిప్పర్రు గ్రామం సంకు అప్పారావు భవనంలో శుక్రవారం సోషలిస్ట్ సమాజ స్థాపకులు కారల్ మార్క్స్ 205వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా మార్క్స్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా డీవీవీఎస్ వర్మ మాట్లాడుతూ సమాజంలో దోపిడి, అసమానతల అంతనికి ఎనలేని కృషి చేసిన వ్యక్తి కారల్ మార్క్స్ అన్నారు. ప్రముఖ విద్యావేత్త సంకు మనోరమ, సీపీఐ పార్టీ నాయకులు నామన వేంకటేశ్వరరావు, గిద్దా సూర్యానారాయణ, అడ్డాల సత్యనారాయణ, కుడిపూడి వెంకట రెడ్డి, కాటూరి రాయుడు, చిక్కాల బ్రహ్మాజీ, మాకినేడి రామకోటి పాల్గొన్నారు.


తణుకులో కారల్ మార్క్స్ చిత్రపటానికి నివాళ్లులర్పిస్తున్న నాయకులు


తూర్పువిప్పర్రులో కారల్ మార్క్స్ జయంతిలో మాట్లాడుతున్న నాయకులు

ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలి


సమావేశ మందిరంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ రాజేశ్వరరావు, తదితరులు

పెంటపాడు: మండలంలో నూతన పనులు గుర్తించాలని జిల్లా డ్వామా పీడీ రాజేశ్వరరావు తెలిపారు. పెంటపాడు మండల సమావేశ మందిరంలో ఇన్‌చార్జి ఎంపీడీవో టీవీ సత్యనారాయణ అధ్యక్షతన జాతీయగ్రామీణ ఉపాధి హామీపై సిబ్బందికి అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విషయాలు చర్చించారు. పనుల నాణ్యత పాటించాలని ఆయన తెలిపారు. ఇప్పటివరకు పూర్తయిన వాటిపై సమీక్ష నిర్వహించారు.

కొండాలమ్మ తల్లిని దర్శించుకున్న మంత్రి కారుమూరి


తణుకులో కొండాలమ్మ తల్లి ఆలయంలో పూజాదికాలు నిర్వహిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: కొండాలమ్మ తల్లి ఆలయ జాతర మహోత్సవల్లో భాగంగా శుక్రవారం రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొండాలమ్మ యూత్ ఆధ్వర్యంలో మంత్రి కారుమూరికి ఘన స్వాగతం పలికారు. ముందుగా కొండాలమ్మ, శ్రీ పల్లాలమ్మ తల్లి విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, నత్తా కృష్ణవేణి, కుడుపూడి చంద్రరావు, కొండాలమ్మ యూత్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చిన్నం సత్యనారాయణ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొండాలమ్మ జాతర

తణుకు టౌన్: తణుకు పట్టణంలో వేంచేసియున్న కొండాలమ్మ, పల్లాలమ్మ వార్ల జాతర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా కొండాలమ్మ యూత్ అధ్యక్షుడు చిన్నం సత్యనారాయణ, నాయకులు చింతాడ సంజీవరావు, అజయ్‌కుమార్, రామకృష్ణ, మాడెం సత్యనారాయణ, లోకనాథ్, ఇతర యూత్ సభ్యులు రవీంద్రనాథ్‌ను సత్కరించారు.

ప్రతి ఒక్కరూ వృద్ధులను ఆదుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ఎయిర్‌స్ట్రిప్ మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో వనచర్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పాలకొల్లుకు చెందిన వైద్యులు పి.వెంకటస్వామి పర్యవేక్షణలో రక్త పరీక్షలు జరిగాయి. 48 మంది వృద్ధులకు బీపీ, షుగర్ మందులు ఉచితంగా అందజేశారు. వాకర్స్ జిల్లా గవర్నర్ శనగన కృష్ణమూర్తి మాట్లాడుతూ వృద్ధుల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. ప్రతి ఒక్కరు సేవా భావంతో వృద్ధులను ఆదుకోవాలని సూచించారు. మహిళా వాకర్స్ సేవలను కొనియాడారు. భార్గవి, మాధవి, ఇందిరా కుమారి, లక్ష్మి, కనకదుర్గ, రామలక్ష్మి, వీఎస్ ప్రసాద్, కేవీ చలం, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ


పాతూరులో నూతనంగా ఏర్పాటు చేసిన రామాలయంలో సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించిన దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పాతూరు పునఃనిర్మాణ నూతన రామాలయంలో శుక్రవారం ఉదయం సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి, వినాయక, జయ, విజయ విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. కర్రి సీతారామయ్య, శేషవేణి, కర్రి ప్రభాకర్ బాలాజీ, పూర్ణచంద్రనాగలక్ష్మి దంపతులు విశేష పూజల్లో పాల్గొన్నారు. స్వాతి నక్షత్రం సందర్భంగా విష్వక్సేన పూజ, కళన్యాస హోమం, గర్తెన్యాస హోమాలు జరిగాయి. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం గోవు, కన్య, కుంభ, బింబ దర్శనా లు జరిగాయి. అనంతరం భక్తులకు స్వామి, అమ్మ వార్ల దర్శనం కల్పించారు. శాంతి కల్యాణం నిర్వహించారు. కొవ్వూరు గాయత్రి పీఠం తల్లాప్రగడ రామకృష్ణ శాస్త్రీచే రామతత్వ ప్రవచనం గావించారు. ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిగింది. స్వామి వారిని దేవాదాయ శాఖ సీజీఎఫ్ సభ్యులు కర్రి భాస్కరరావు, శాప్ డైరెక్టర్ కర్రి విజయలక్ష్మి, పట్టణ ప్రముఖులు హాజరై స్వామివారిని దర్శించారు.

గ్రంథాలయాలు విద్యాలయాలకు వెన్నెముకలు


వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు శేషగిరిరావు

తాడేపల్లిగూడెం: గ్రంథాలయాలు విద్యాలయాలకు వెన్నెముకలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు ఎం.శేషగిరిరావు అన్నారు. శుక్రవారం ఆయన పెదతాడేపల్లిలోని వాసవీ ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజా గ్రంథాలయాల అభివృద్ధికి మనం మన గ్రంథాలయం అనే పేరుతో ఒక వినూత్న కార్యక్రమాన్ని చేపట్టి, ప్రతి నెలా మొదటి శనివారం రాష్ట్రంలోని ఒక ప్రజాగ్రంథాలయాన్ని సందర్శించి ఆ గ్రంథాలయం ఏ పరిస్థితిలో ఉంది. దాని అభివృద్ధి కోసం ఏం చేయాలి, గ్రంథాలయం పరిశుభ్రంగా ఉందా లేదా అనే విషయాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాసవీ ఇంజనీరింగ్ కళాశాల బాగుంటుందని తెలిసి సందర్శించడానికి వచ్చానన్నారు. విద్యాలయాలకు వెన్నుముకగా నిలిచే గ్రంథాలయాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థుల ఎదుగుదలకు గ్రంథాలయాలు ఎంతగానో తోడ్పడుతుందన్నారు. మానసిక వత్తిడిని జయించేందుకు గ్రంథాలయాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ, సభ్యులు చలంచర్ల మురళీ, ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు, లైబ్రేరియన్ డాక్టర్ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి


సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగ నాగార్జునను కలిసి వినతిపత్రం అందిస్తున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కేంద్ర రంగ సంస్థలనన్నింటిని ప్రైవేట్ పరం చేయడం ద్వారా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లుకు తూట్లు పొడుస్తున్నందున ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు కల్పించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు విజ్ఞప్తి చేశారు. తాడేపల్లిగూడెం వద్ద హైవేలో వెళ్తున్న ఏపీ రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున్‌ను మంగరాజు శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. మంగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం అనే రెండు కళ్ల సిద్ధాంతంతో అన్ని వర్గాల ప్రజలను, అన్ని ప్రాంతాలను సమానంగా చూస్తున్నారని, అలాగే రాష్ట్ర ప్రజల మన్ననలను పొందుతున్నారని కొనియాడారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, కాపులకు పెద్ద పీట వేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు సభ్యులు పాల్గొన్నారు.

రేపు తణుకులో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

తణుకు: పట్టణంలోని స్త్రీ సమాజం రోడ్డులో నారాయణ కళాశాల ఆవరణలో ఈనెల 7న కెరీర్ గైడెన్స్‌పై అవగాహన ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ పార్థసారథి రెడ్డి తెలిపారు. పదో తరగతి అనంతరం తీసుకోవాల్సిన కోర్సులతో పాటు ఐఐటీ, నీట్, జేఈఈ అడ్వాన్స్‌డ్ తదితర పోటీ పరీక్షలను ఎదుర్కొనే విధానంపై ఈ సదస్సు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమ్యే ఈ సదస్సులో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొనవచ్చని వివరించారు.

బాల్యవివాహాల నిరోధానికి టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు


బాల్యవివాహాల చట్టంపై అవగాహన కల్పిస్తున్న టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు


అత్తిలి: బాల్యవివాహాల నిరోధించడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు చెప్పారు. అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బాల్యవివాహాల నిరోధక చట్టంపై పురోహితులు, పాస్టర్స్, ఇమామ్‌లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బాల్యవివాహాలు నేటి ఆధునిక సమాజంలో అక్కడక్కడ బాల్యవివాహాలు సంఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. బాల్యవివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఎంపీడీవో రామారావు మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతుంటే సమాచారాన్ని తమకు తెలపాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ ఎం ఆశాజ్యోతి మాట్లాడుతూ బాల్యవివాహాలు నిరోధక చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయడానికి ప్రజలు సహకరించాలని, చట్టాన్ని అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి మాట్లాడుతూ బాల్యవివాహాలు వల్ల తల్లీబిడ్డలకు శారీరక, మానసిక సమస్యలు తలెత్తుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎంపీపీల చాంబర్ ప్రధాన కార్యదర్శిగా మంగ తాయారు


ఎంపీపీ అలివేలు మంగ తాయారు

ఇరగవరం: పశ్చిమ గోదావరి జిల్లా ఎంపీపీల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇరగవరం మండల ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగ తాయారు ఎన్నికై య్యారు. భీమవరంలో రాష్ట్ర కన్వీనర్ హనుమంతరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎన్నికైనట్లు ఆమె తెలిపారు. ఎంపీపీల సంక్షేమం కొరకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఎంపీపీల అభివృద్ధికి, ఎంపీటీసీ, ప్రజా సమస్యల పరిష్కారానికి పాడుపడతానని పేర్కొన్నారు. మండలంలోని ఎంపీటీసీలు, నాయకులు పలువురు మంగతాయారుకు అభినందనలు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలి


పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ) : పరిసరాల పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలని, తద్వారా కాలానుగుణ వ్యాధులను అరికట్టుటలో అవగాహన పెంపొందించుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. హెల్త్ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది ఆధ్వర్యంలో పట్టణంలో 1,3,6,7,8, 13,14,15,16 వార్డుల పరిధిలో ఫ్రై డే, డ్రై డే కార్యక్రమాలు, ఫీవర్ సర్వేలు, కీటక నియంత్రణ చర్యలు జరిగాయి. ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ వారంలో ఒకరోజు డ్రై డే పాటించడం ద్వారా పరిసరాల పరిశుభ్రత పాటించవచ్చునని తెలిపారు. ఇంటింటికి అవగాహన కార్యక్రమంలో భాగంగా దోమల ద్వారా వచ్చే వ్యాధులపై ఆరోగ్య సూత్రాలను వెల్లడించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులు చంద్ర, అంబిక, ఆశాలు, శానిటేషన్ కార్యదర్శి, వాలంటీర్లు అంగన్‌వాడీలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


పాలూరులో ఉపాధికూలీలతో మాట్లాడుతున్న జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి వీరాస్వామి

అత్తిలి: ఉపాధి పనుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి వీరాస్వామి హెచ్చరించారు. మండలంలో ఉనికిలి, పాలూరు గ్రామాల్లో నీట మునిగిన చెరువులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో చెరువుతీత పనులు 50 శాతం పూర్తయ్యాయని, అకాల వర్షాల వల్ల రెండు చెరువులు నీటితో నిండిపోయాయని, దీంతో పూడికతీత పనులకు ఆటంకం ఏర్పడిందన్నారు. యుద్ధ ప్రాతిపదికన నీటిని తోడే ఏర్పాటు చేయాలని పంచాయతీ, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. రెండు చెరువులకు తూములు ఏర్పాటుకు బడ్జెట్ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఎంపీడీవో రామారావు మాట్లాడుతూ జీజీఎ రిజిష్టర్లు, అటెండెన్స్ కార్యక్రమాలకు త్వరలో శిక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ఫణిరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ తేలి స్వరూప్, ఎంటీసీ శ్రీనివాస్, టీఏ నవ్యలత, బోసు తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో 15 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 15 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వైకేవీ.అప్పారావు శుక్రవారం తెలిపారు. పెంటపాడు మండలంలో 30.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తెలిపారు.

8 నుంచి గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరాలు

అత్తిలి: ఈనెల 8వ తేదీనుంచి జూన్ 16వ తేదీ వరకు ఆరవల్లి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి ఎస్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పుస్తక పఠనం, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్‌లపై 40 రోజుల పాటు గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చాముండేశ్వరీ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

అత్తిలి: స్థానిక పడవల రేవులో వేంచేసియున్న విజయచాముండేశ్వరిదేవి అమ్మవారి ఆలయ పునఃనిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. వివిధ పార్టీల నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం


పురవీధుల్లో లక్ష్మీనరసింహస్వామి నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పాతూరులో వేంచేసియున్న దేవాదాయ ధర్మదాయ శాఖ పురాతన లక్ష్మీ నరసింహస్వామి ఆలయం నుంచి శుక్రవారం రాత్రి లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం పురవీధులలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు తొలుత ఆలయం వద్ద విశేష పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై రథోత్సవంలో పాల్గొన్నారు. భక్తులు స్వామివారిని దర్శించారు. ఆలయ కమిటీ చైర్మన్ కల్లి వెంకట నాగ శ్రీనివాస్, పి.కుమార్‌స్వామి, కమిటీ సభ్యులు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.